# సాక్షి నిజామాబాద్

బుధవారం, 7, మే, 2025






### వేసవి తాపం..

ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ఉపశమనం కోసం ప్రజలు శీతల పానీయాల వైపు ఆసక్తి చూపుతున్నారు.

- 8లో ▸



### నీటిని ఒడిసి పట్టి..

మోర్తాడ్ మండలం దోన్‌పాల్ గ్రామం కరువును జయించి, పుష్కల నీటి వనరులతో ఆదర్శంగా నిలుస్తోంది.

- 8లో ▸

### వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
42.8 /20.8

ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ కామారెడ్డి విద్యార్థే!



జి.చంద్రశేఖర్‌రెడ్డి, ఐఎఫ్ఎస్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : స్టేట్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా నియమితులైన ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థి. ఆయన 1982 –85 లో ఇక్కడ బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సు చదివారు. కళాశాల అలుమ్నికి పలుమార్లు హాజరయ్యారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం బోర్గావ్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి.. అప్పట్లో కామారెడ్డిలో స్నేహితులతో కలిసి అద్దె ఇంట్లో ఉంటూ బీఎస్సీ ఫారెస్ట్రీ పూర్తి చేశారు. కామారెడ్డిలో ఆయనకు చాలామంది మిత్రులున్నారు. డిగ్రీ పూర్తయ్యాక ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుంచి లైఫ్ సైన్సెస్‌లో పీజీ చేశారు. 1991లో ఐఎఫ్ఎస్ అధికారిగా ఎంపికై వివిధ ప్రాంతాల్లో పనిచేశారు.

### నేడు జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ – 7, 9, 11 బాలబాలికల విభాగంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలను నగరంలోని అభ్యాస స్కూల్‌లో బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రమేశ్, ఆరుట్ల రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 2018 జనవరి 1 తరువాత జన్మించిన వారు అండర్ – 7 విభాగంలో, 2016 జనవరి 1 తరువాత జన్మించిన వారు అండర్ – 9 విభాగంలో, 2014 జనవరి 1 తరువాత జన్మించిన వారు అండర్ – 11 విభాగంలో ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని వివరించారు. మరిన్ని వివరాలకు 94400 07004 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### ఎంఎల్‌హెచ్‌పీలకు బ్రిడ్జి కోర్సు ప్రారంభం



నిజామాబాద్ నాగారం: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో నూతనంగా నియామకమైన ఎంఎల్‌హెచ్‌పీ లకు మూడు నెలల బ్రిడ్జి కోర్సును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి రాజశ్రీ మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ లకు వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, మాతా శిశు సంరక్షణ, జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, ప్రజారోగ్యం కుటుంబ సంక్షేమం, జీవనశైలి వ్యాధులు, ప్రజారోగ్య పరిరక్షణ, ఆరోగ్య కార్యక్రమాల ఆన్లైన్ ఎంట్రీ, పీసీపీఎన్డీటీ, జాతీయ ఆరోగ్య మిషన్ అంశాలపై మూడు నెలలు పాటు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగే శిక్షణ కార్యక్రమానికి ఎంపికైన ఎంఎల్‌హెచ్‌పీలు క్రమం తప్పకుండా హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు, డీహెచ్ఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.

### వరల్డ్ యూనివర్సిటీ చాంపియన్ షిప్‌నకు ఎంపిక



రిత్వీక

నిజామాబాద్ నాగారం: ఆల్ ఇండియా యూనివర్సిటీ సెలక్షన్ ట్రయల్స్ ఫర్ వరల్డ్ యూనివర్సిటీ చాంపియన్ షిప్ స్విమ్మింగ్ పోటీలకు జిల్లాకు చెందిన రిత్వీక ఎంపికైంది. గత నెల 24, 25 తేదీల్లో కర్నాటక రాష్ట్రంలో నిర్వహించిన ఆల్ ఇండియా యూనివర్సిటీ స్విమ్మింగ్ పోటీల్లో రిత్వీక ఉత్తమ ప్రతిభ కనబర్చి 50 మీటర్ల బెస్ట్ స్ట్రోక్ స్విమ్మింగ్‌లో బంగారు పతకం సాధించింది.

దేశం తరఫున వరల్డ్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ – 2025 పోటీలకు ఎంపికైన రిత్వీక జర్మనీ దేశంలోని బెర్లిన్ నగరంలో జులై 16 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న పోటీల్లో పాల్గొననుంది.రిత్వీకను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి ఉమేశ్, ఉపాధ్యక్షులు జి మహిపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడీల శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు కర్నాటక శ్రీనివాస్, శ్యాంసుందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ముత్యాల శ్రీనివాస్, రాగిణి తదితరులు అభినందించారు.

# ఔషధ గుణాల తాటిముంజ



ఆర్మూర్ శివారులోని 63వ నంబర్ జాతీయ రహదారి పక్కన తాటి ముంజలు అమ్ముతున్న మహిళలు



ఔషధ గుణాలు కలిగి ఉన్న తాటిముంజల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. 63వ నంబర్ జాతీయ రహదారికి ఇరువైపులా గీత కార్మికుల కుటుంబాలకు చెందిన మహిళలు ముంజలు విక్రయిస్తున్నారు. డజన్ ముంజల ధర రూ.వంద పలుకుతోంది. తాటి కల్లు తరహాలోనే ముంజలకు సైతం ఔషధ గుణాలు ఉంటాయని మన పూర్వీకులతోపాటు వైద్యులు సైతం పేర్కొంటున్నారు. మానవ శరీరంలోని టాక్సిన్‌ను వదిలించుకోవడానికి తాటి ముంజలు సహాయ పడతాయని, శరీర సహజ ఉష్ణోగ్రత నిర్వహణకు సహాయపడుతాయంటున్నారు. బరువును అదుపులో ఉంచుకోవాలనుకునే వారికి తాటి ముంజలు చక్కని ఫలహారం. ఆటలమ్మ వంటివి సోకినప్పుడు శరీరంపై ఏర్పడే పుండ్లపై తాటి ముంజల నీటిని పట్టిస్తే దురద తగ్గి అవి త్వరగా మానిపోతాయి. కొన్ని ప్రాంతాల్లో తాటి ముంజలతో శీతల పానీయాలను కూడా తయారు చేస్తారు. తమిళనాడులో తాటిముంజల పానీయాన్ని 'ఎలనీర్ నుంగు' అంటారు. – ఆర్మూర్


### పుష్కలంగా విటమిన్లు, ఖనిజ లవణాలు



మూడు తాటి ముంజలు తింటే ఒక కొబ్బరి బొండం తాగినంత ఫలితం ఉంటుంది.లేత తాటి ముంజల్లో దాదాపు ఎనభై శాతానికి పైగా నీరే ఉంటుంది. వీటిలో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. తాటి ముంజలు వేడిమి నుంచి సైతం రక్షణ కల్పిస్తాయి. 100 గ్రాముల ముంజల్లో 43 కేలరీలు ఉంటాయి.

– డాక్టర్ రమేశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్మూర్

# మోడిఫైడ్ న్యూసెన్స్



మోడిఫైడ్ సైలెన్సర్లను వాడటం చట్ట విరుద్ధమని తెలిసినా వాహనదారులు వెనక్కి తగ్గడం లేదు. బండి రిజిస్ట్రేషన్ పూర్తయ్యే వరకు అంతా నిబంధనల ప్రకారం ఉంటున్నా ఆ తరువాత రోడ్లపైకి వచ్చేసరికి పరిస్థితి మారుతోంది. తమకు నచ్చిన రీతిలో సౌండ్ వచ్చేలా మోడిఫైడ్ సైలెన్సర్లను వాహనాలకు ఏర్పాటు చేసుకుంటూ న్యూసెన్స్ చేస్తున్నారు. సుమారు 45 రోజుల వ్యవధిలో జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు 460 మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి ధ్వంసం చేయడం శబ్ద కాలుష్యం తీవ్రతకు అద్దం పడుతోంది.

### 45 రోజుల్లో 460 సైలెన్సర్ల తొలగింపు.. ధ్వంసం

- వాహనదారులకు జరిమానా
- రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక మారుస్తున్న వైనం
- కఠినంగా వ్యవహరిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఖలీల్‌వాడి: రయ్యుమని పక్క నుంచి దూసుకెళ్లే ద్విచక్ర వాహనాలు చేసే శబ్దానికి గుండెలు అదురుతున్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో యువకులు బైక్‌లకు అధిక శబ్దం వచ్చే మోడిఫైడ్ సైలెన్సర్లు ఏర్పాటు చేస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అసలే ఇరుకుగా ఉండే నిజామాబాద్ నగర రోడ్లపై ట్రాఫిక్ స్తంభించిన సమయంలో మోడిఫైడ్ సైలెన్సర్లు, హారన్‌ల గోల అంతా ఇంతా కాదు. వాయు, శబ్ద కాలుష్యంతో ప్రజలు విసుగెత్తిపోతున్నారు. ఖరీదైన ద్విచక్ర వాహనాలకే ఎక్కువగా మోడిఫైడ్ సైలెన్సర్లు, హారన్‌లు ఏర్పాటు చేయిస్తున్నారు. పోలీసులు జరిమానా విధిస్తున్నా యువతలో ఎలాంటి మార్పు రావడం లేదు. నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఈ ఏడాది మార్చి 6వ తేదీన 240 సైలెన్సర్లను, ఏప్రిల్ 18వ తేదీన 220 సైలెన్సర్లను నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రోడ్డు రోలర్‌తో తొక్కించారు. నెలన్నర వ్యవధిలోనే 460 సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు ధ్వంసం చేశారు.

#### ఆర్టీఏ ఆఫీస్‌లో అంతా ఓకే..

ఆర్టీఏ ఆఫీసులో వాహనం రిజిస్ట్రేషన్ పూర్తయ్యే వరకు కంపెనీ నుంచి వచ్చిన సైలెన్సర్లను ఉంచుతున్న వాహనదారులు ఆ తరువాత రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు వెచ్చించి మోడిఫైడ్ సైలెన్సర్లను ఏర్పాటు చేయించుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తూ మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగిస్తున్నప్పటికీ మండల స్థాయిలో స్థానిక పోలీసులు కఠినంగా వ్యవహరించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితం ప్రశాంతంగా ఉండే పల్లెల్లో సైతం మోడిఫైడ్ సైలెన్సర్ల శబ్దానికి ప్రజలు హడలెత్తుతున్నారు.

#### ఈ ప్రాంతాల్లో హారన్ కొట్టొద్దన్నా..

రోడ్డు పై ప్రయాణించే సమయంలో ఎదురుగా ఏదైనా వాహనం వస్తేనే హారన్ కొట్టాలి. పాఠశాలలు, కోర్టులు, పోలీస్‌స్టేషన్, ప్రార్థనాలయాలు, ఆస్పత్రులు ఉన్న ప్రాంతాల్లో హారన్ కొట్టడం పూర్తిగా నిషేధం. సరైన అవగాహన లేక ఎవరూ పాటించటం లేదు. వేడుకలు, ర్యాలీల సమయాల్లో హారన్‌లు, సైలెన్సర్ల శబ్దంతో యువత హడలెత్తిస్తున్నారు.

#### శబ్ద కాలుష్యంతో సమస్యలెన్నో..

భారీ శబ్దాల కారణంగా కర్ణభేరికి రంధ్రం పడే అవకాశం ఉంటుంది. సాధారణంగా శబ్దం 55 డెసిబెల్స్(డీబీ) కన్నా అధికంగా ఉంటే శబ్ద కాలుష్యం ఏర్పడుతుంది. రద్దీ ప్రాంతాల్లో 55 నుంచి 90 డెసిబెల్స్ ఉంటుంది. పరిశ్రమలు ఉండే ప్రాంతాల్లో 95 డెసిబెల్స్ కన్నా అధికంగా ఉంటుంది. శబ్ద కాలుష్యంతో మానసిక సమస్యలతోపాటు హైబీపీ, గుండెజబ్బులూ వస్తాయి. చెవి వెనుకభాగం నరాలు దెబ్బతినడంతో ప్రతిధ్వనులు వినిపిస్తాయి. వినికిడి శక్తి తగ్గిపోతుంది. శబ్దకాలుష్యం నివారణ చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నిజామాబాద్ నగరంలో సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

#### ఆటో మొబైల్స్‌కు నోటీసులు ఇస్తాం



శబ్ద కాలుష్యం చేసే సైలెన్సర్లు అమ్మే ఆటో మొబైల్స్‌కు నోటీసులు ఇస్తాం. నగరంలోని రోడ్లపై రాత్రివేళ్లలో అధిక శబ్దం చేసే వాహనాలతో యువకులు తిరుగుతున్నారు. సీపీ సాయిచైతన్య ఆదేశాల మేర కు ఆపరేషన్ ఛబుత్రా నిర్వహిస్తాం. రాత్రివేళల్లో ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేస్తాం. ప్రజలకు ఇబ్బంది లు కలిగించే శబ్దాలు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్, ట్రాఫిక్ సీఐ, నిజామాబాద్

# పూడిక తొలగింపుపై ఆశలు



ఎస్సారెస్పీలో పేరుకు పోయిన పూడిక

- ఎస్సారెస్పీ, నాగార్జున సాగర్‌లో పూడిక తొలిగిస్తామన్న మంత్రి ఉత్తమ్
- పెరగనున్న నీటి నిలువ సామర్థ్యం

బాల్కొండ: రాష్ట్రంలో పెద్ద ప్రాజెక్టులు అయిన శ్రీరాంసాగర్, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల్లో పూడిక తొలిగిస్తామని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి రెండు రోజుల క్రితం దేవాదుల ప్రాజెక్ట్ సందర్శన సందర్భంగా ప్రకటించారు. దీంతో ఎస్సారెస్పీలో పూడిక తొలగింపుపై ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. ఎస్సారెస్పీని నాలుగు నెలల క్రితం సందర్శించిన సమయంలో కూడా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంతర్జాతీయ సాంకేతికతతో పూడిక తొలిగిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 11.2 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండగా, పూడిక తొలిగించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి పూడిక తొలగిస్తే ప్రస్తుతంతో పోలిస్తే నీటి నిల్వ సామర్థ్యం అదనంగా 31.5 టీఎంసీల వరకు పెరిగే అవకాశం ఉంది. ఎగువ నుంచి ప్రతి ఏడాది వందల టీఎంసీల ఇన్‌ఫ్లో వస్తున్నా పూడిక కారణంగా నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంతో దిగువకు విడుదల చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ సీజన్‌లోనే పూడిక తొలిగింపు చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

#### పూడిక ఇలా..

ఎస్సారెస్పీ నిర్మాణం పూర్తయిన 1978లో నీటి నిల్వ సామర్థ్యం 112 టీఎంసీలుగా నేషనల్ హైడ్రో గ్రాఫిక్ సర్వే నిర్ధారించింది. ఆ తరువాత 1994లో ఏపీఈఆర్ఎల్ (ఆంధ్ర ప్రదేశ్ ఇంజినీరింగ్ లేబరేటరీస్ సంస్థ) 90 టీఎంసీలకు నీటి నిల్వ సామర్థ్యం పడిపోయినట్లు తెలిపింది. తరువాత 2014 – 15లో బెంగళూర్‌కు చెందిన సంస్థ సర్వే చేపట్టి నీటి నిల్వ సామర్థ్యం 70 టీఎంసీలకు పడిపోయినట్లు స్పష్టం చేసింది. కానీ ప్రాజెక్ట్ అధికారులు ఆ లెక్కను కొట్టి పారేశారు. 2023లో చేపట్టిన మరో సంస్థ సర్వే ప్రకారం నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు పడిపోయినట్లు తేల్చారు. మంత్రి ప్రకటించిన విధంగా పూడిక తొలగిస్తే 31.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# నాణ్యమైన విత్తనాలను వినియోగించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

మోర్తాడ్: పంటల సాగులో నాణ్యమైన విత్తనాలనే వినియోగించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట్ అన్వేష్‌రెడ్డి రైతులకు సూచించారు. తమ సంస్థ ఉత్పత్తి చేసిన విత్తనాలను వినియోగిస్తే ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. మంగళవారం భీమ్‌గల్ మండలం ముచ్కూర్‌లో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంటల సాగులో రసాయనాలను వినియోగించే విధానానికి స్వస్తి పలకాలని సూచించారు.

భూసారం దెబ్బతినకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో తప్పకుండా రసీదు తీసుకోవాలని, అనేక ప్రైవేట్ కంపెనీలు రైతులకు నాణ్యత లేని విత్తనాలను అంటగట్టి నట్టేటా ముంచుతున్నాయని ఆరోపించారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను స్వీకరించి పంటల సాగు లో మెరుగైన విధానాలను అవలంబించాలని కోరారు. కార్యక్రమంలో జేడీఏ సాయికృష్ణ, ఏవో లావణ్య, శాస్త్రవేత్తలు శ్రీలత, దినేశ్, కాంగ్రెస్ నాయకులు బోదిరె స్వామి, కుంట రమేశ్, కన్నె సురేందర్, కొరడి రాజు, అనంతరావు, బంగ్లా దేవేందర్, గంగారెడ్డి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

#### శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పాటించి లాభాలు గడించాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ రైతులకు సూచించారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలోభాగంగా రుద్రూర్ చెరుకు, వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు మంగళవారం మండలంలోని సిర్‌పూర్‌లో అవగాహనాసదస్సు నిర్వహించారు. ఏవో సౌమ్య, శాస్త్రవేత్తలు సౌందర్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె వెంకట్‌రెడ్డి రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

# వేగం.. విధ్వంసం

- ఓవర్ లోడ్ టిప్పర్లతో పల్లె రోడ్లు తుక్కు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- రైతుల పేరుతో ఇటుక బట్టీలకు నల్ల మట్టి తరలింపు!
- డొంకేశ్వర్ మండలం అన్నారం, సిర్పూర్‌లో రెచ్చిపోతున్న మాఫియా

డొంకేశ్వర్(ఆర్మూర్): రైతుల పేరు చెప్పుకొని నల్ల మట్టి మాఫియా రెచ్చిపోతోంది. భారీ వాహనాల (డంపర్ల)తో ప్రకృతి విధ్వంసం చేస్తున్నారు. టిప్పర్ల మోతకు డొంకేశ్వర్ మండలంలో పచ్చని పల్లెలు పొగ, దుమ్ము కాలుష్యానికి గురవుతున్నాయి. ఓవర్ లోడ్ కారణంగా బీటీ రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. అతివేగంతో నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారులు కళ్లు మూసుకొని మౌనంగా ఉంటున్నారు. అందరూ 'మామూలు'గానే చూసి వదిలేయడం పట్ల విమర్శలు వస్తున్నాయి. డొంకేశ్వర్ మండలంలో అన్నారం, సిర్పూర్ గ్రామ పరిధిలో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో నల్ల మట్టిని తీసుకోడానికి ఏకంగా అక్కడి గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)లు అనధికార అనుమతులు ఇచ్చాయి. లక్షల్లో టెండర్లు నిర్వహించి ఎంతైనా తోడుకోండని భూములను అప్పగించాయి. దీంతో నల్లమట్టి మాఫియా వందల సంఖ్యలో భారీ టిప్పర్లను, పెద్ద పెద్ద పొక్లెయిన్‌లను రంగంలోకి దించారు. వీడీసీలకు పెట్టిన పెట్టుబడి తీసి నాలుగింతల లాభాలు పొందేందుకు నల్లమట్టిని పగలు, రాత్రి తేడా లేకుండా తోడేస్తున్నారు. ఓవర్ లోడ్ మట్టితో వరుసపెట్టి మితిమీరిన వేగంతో వెళ్తున్నాయి. దీంతో మండలంలో ఆయా గ్రామ ప్రజలు ఇళ్ల నుంచి రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు. పిల్లలను బయటకు పంపడం లేదు. ఇటీవల డొంకేశ్వర్ శివారులో రాంగ్ రూట్‌లో వేగంగా వస్తున్న టిప్పర్‌ను తప్పించబోయి ఓ వ్యక్తి తన ట్రాక్టర్‌ను పొలాల్లోకి తీసుకెళ్లాడు. అదృష్ట వశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఓవర్ లోడ్ కారణంగా నల్లమట్టి రోడ్లపై పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు అదుపు తప్పి ఇద్దరు ముగ్గురు గాయాలపాలయ్యారు. టిప్పర్ల మోతను చూసి డొంకేశ్వర్, దత్తాపూర్ గ్రామాల నుంచి వాహనాలను రానివ్వడం లేదు. వస్తే అడ్డుకుంటామని హెచ్చరించడంతో మట్టి మాఫియా రూటును మార్చింది. అన్నారం, జీజీ నడ్కుడ, నూత్‌పల్లి, మారంపల్లి మీదుగా టిప్పర్లను తరలిస్తున్నారు. మండలంలో కొన్ని గ్రామాల్లో ఎవరికీ ఇబ్బందులు లేకుండా రైతులే స్వయంగా ట్రాక్టర్ల ద్వారా పొలాలకు నల్లమట్టిని కొడుతున్నారు. కానీ, అన్నారం, సిర్పూర్ గ్రామాల్లోనే నిబంధనకు విరుద్ధంగా రైతుల పేరు చెప్పుకుని భారీ పొక్లెయిన్లు, టిప్పర్లు, లారీలు పెట్టి నల్లమట్టిని మండలాన్ని, జిల్లాను సైతం దాటిస్తున్నారు. పదహారు టైర్ల లారీల్లో ఇటుక బట్టీలకు తరలించి వ్యాపారం చేస్తున్నారు. టిప్పర్లు నడిపే డ్రైవర్లు మద్యం సేవించి నడుపుతున్నారు. మైనర్లకు డ్రైవింగ్ ఇస్తున్నారు. అదుపు తప్పితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది.



నల్ల మట్టిని నింపుకొని అన్నారం మీదుగా ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్



డొంకేశ్వర్ వద్ద రాంగ్ రూట్‌లో వేగంగా వచ్చిన టిప్పర్‌ను తప్పించబోయి పొలాల్లోకి వెళ్లిన ట్రాక్టర్ (ఫైల్)

ఇటీవల అనుమతి లేకుండా ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లను పట్టుకున్న పోలీసులు ఎస్సారెస్పీ ఇరిగేషన్ అధికారులు జోక్యం చేసుకోవడంతో మట్టిని అక్కడే పోయించి వాటిని వదిలేశారు. రాజకీయ అండ ఉండడంతోనే నల్లమట్టి మాఫియా రెచ్చిపోతుందనే విమర్శలు ఎక్కువగా వస్తున్నాయి.



దుమ్ము లేవడంతో ఇబ్బంది పడుతున్న ద్విచక్రవాహనదారుడు



ధ్వంసమైన జీజీ నడ్కుడకు వెళ్లే బీటీ రోడ్డు

## క్లుప్తంగా

### ఆర్మూర్‌లో సినీనటి నేహాశెట్టి సందడి



ఎల్వీఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సినీనటి నేహాశెటి, తదితరులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణంలో మంగళవారం డీజే టిల్లు సినిమా ఫేమ్ నేహా శెట్టి సందడి చేశారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఎల్వీఆర్ షాపింగ్ మాల్‌ను మంగళవారం సినీనటి నేహాశెట్టి, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా నేహా శెట్టితో సెల్ఫీలు తీసుకోవడానికి అభిమానులు ఎగబడ్డారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, నాయకులు పండిత్ పవన్, ఎల్వీఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

### రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



బాల్కొండ: రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. భూసమస్యల సత్వర పరిష్కారం కోసమే భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెండోరా మండల కేంద్రంలో, మండలంలోని బుస్సాపూర్‌లో మంగళవారం పైలట్ ప్రాజెక్టులో భాగంగా భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ సదస్సులను పరిశీలించి, మాట్లాడారు. భూభారతి చట్టం ద్వారా పల్లెల్లో భూ సమస్యలు వెంటనే పరిష్కరించబడుతాయన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులో చేసుకున్న దరఖాస్తులకు వెంటనే పరిష్కారం లభిస్తుందన్నారు. సదస్సులో హెల్ప్‌డెస్క్, జనరల్ హెల్ప్ డెస్క్ పనితీరును పరిశీలించారు. ఆర్మూర్ ఆర్డీవో రాజుగౌడ్, మెండోరా తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, వేల్పూర్ మార్కెట్‌కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

# నీటిని ఒడిసి పట్టి.. కరువును జయించి..

**ఆదర్శంగా నిలిచిన దోన్‌పాల్**

- సమగ్ర నీటి సంరక్షణ చర్యలతో 2002 నుంచి కనిపించని కరువు ఛాయలు
- వేసవిలోనూ సమృద్ధిగా భూగర్భ జలాలు



దోన్‌పాల్ శివారులోని ఊట కుంటలో నీరు



మోర్తాడ్ మండలం దోన్‌పాల్ అటవీ ప్రాంతంలో తవ్విన కందకంలో నిల్వ ఉన్న నీరు

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలం దోన్‌పాల్ గ్రామం కరువును జయించి, పుష్కల నీటి వనరులతో ఆదర్శంగా నిలుస్తోంది. వేసవిలోనూ గ్రామంలోని బోర్లు సమృద్ధిగా భూగర్భ జలాల ఉండటంతో నీటి కొరత లేకుండా పోయింది.

**2002కు ముందు..**

దోన్‌పాల్ పూర్తిగా వ్యవసాయ ఆధారిత గ్రామం. 2002కు ముందు ఎలాంటి సమగ్ర నీటి సంరక్షణ చర్యలు తీసుకోక పోవడంతో నవంబర్, డిసెంబర్ లోనే నీటి కొరత ఛాయలు కనిపించేవి. రైతులు తమ యాసంగి పంటలను గట్టెక్కించుకోలేక తీవ్రంగా నష్టపోయేవారు. గ్రామం చుట్టూ అడవి ఉన్నా వర్షపు నీటిని సంరక్షించుకునే చర్యలు లేకపోవడంతో బోర్లు ఎత్తిపోయేవి. వర్షాకాలం వచ్చే వరకూ నీటి కోసం రైతులు, గ్రామస్తులు ఎదిరి చూసే పరిస్థితి ఉండేది.

**ఎంపీడీవో అంజనేయులు విశేష కృషి..**

గ్రామంలోని కరువు దుస్థితిని అప్పట్లో మోర్తాడ్ ఎంపీడీవోగా పని చేసిన అంజనేయులు చూసి స్పందించారు. ఉన్నతాధికారులకు దోన్‌పాల్‌లోని నీటి సమస్యను విన్నవించడంతో అప్పట్లోనే కందకాలను తవ్వించారు. ఊట కుంటలను ఏర్పాటు చేశారు. బోర్ల వద్ద రీచార్జి చర్యలు తీసుకోవడం, ఇంకుడు గుంతలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి చర్యలతో దోన్‌పాల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. అప్పట్లో తీసుకున్న చర్యలతో గ్రామంలో కరువు జాడలు అసలే లేవు. 2015లో ఏర్పడిన తీవ్ర కరువు పరిస్థితిలోనూ గ్రామంలోని రైతాంగం తమ పంటలను గట్టెక్కించుకోగలిగారు. ప్రతి వేసవిలో చెరువు ఎండిపోయినా భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండి నీటి కొరత అనేది లేకుండా పోయింది. అటవీ ప్రాంతంలో తవ్విన కందకాల వల్ల నీరు నిల్వ ఉండి వన్య ప్రాణులకు వేసవిలోనూ తాగు నీరు దొరుకుతుంది. ఈసారి వర్షాపాతం తక్కువగా ఉండటంతోనే కుంటలు, కందకాలలో నీరు తక్కువగా ఉందని, లేకుంటే ఎప్పుడు నిండు కుండలా ఉండేవని గ్రామస్తులు తెలిపారు. పదుల సంఖ్యలో కందకాలు, ఊట కుంటలు తవ్వించడంతో నీటి సంరక్షణ చర్యలు సజావుగా సాగుతున్నాయి.

**నీటి కొరత అసలే లేదు..**



చాలా సంవత్సరాల నుంచి మా గ్రామంలో నీటి కొరత అసలే లేదు. రైతులు వేయించుకున్న బోర్లు ఎత్తిపోయిన జాడ అసలే లేదు. ఈసారి వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో కుంటలలో నీరు కొంత భాగమే ఉంది. అయినా ఎలాంటి సమస్య రాదు.

– పర్స గంగయ్య, రైతు, దోన్‌పాల్

**ఐక్యంగా ఉండి నీటి సంరక్షణ చర్యలు..**



నీటి కొరత తీర్చుకోవడానికి గ్రామస్తులు అందరూ ఐక్యంగా ఉండి నీటి సంరక్షణ చర్యలు తీసుకున్నాం. పొరుగు గ్రామాలలో నీటి సమస్య ఉత్పన్నమైనా మా గ్రామంలో మాత్రం నీటి సమస్య అసలే లేదు. నీటి సంరక్షణ విషయంలో అందరం కట్టుబడి ఉన్నాం.

– శ్రీనివాస్‌గౌడ్, రైతు, దోన్‌పాల్

**గ్రామస్తుల సహకారంతోనే..**



దోన్‌పాల్‌లో నీటి సమస్యను గుర్తించాం. అందరికి అవగాహన కల్పించి నీటి సంరక్షణ కోసం ఉద్యమంగా కదిలించాం. మేము అప్పట్లో తీసుకున్న నిర్ణయంతో గ్రామం పేరు రాష్ట్ర స్థాయిలో మారుమోగింది. దోన్‌పాల్ గ్రామస్తుల నిర్ణయం ఎన్నో గ్రామాలకు స్ఫూర్తిదాయకం.

– అంజనేయులు, రిటైర్డ్ ఎంపీడీవో, మోర్తాడ్

### బీఈడీ, బీపెడ్ ఫలితాలు విడుదల



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఫిబ్రవరిలో జరిగిన బీఈడీ, బీపెడ్ 1, 3వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వర్సిటీ వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరి మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి సంపత్‌కుమార్, ఆడిట్‌సెల్ డైరక్టర్ ఘంటా చంద్రశేఖర్, అడిషనల్ కంట్రోలర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఫలితాల వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.in ను సంప్రదించాలని కంట్రోలర్ సంపత్‌కుమార్ సూచించారు.

**14 నుంచి డిగ్రీ పరీక్షలు ప్రారంభం**

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షలు ఈ నెల 14నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ రెగ్యులర్ 2, 4, 6వ సెమిస్టర్, బ్యాక్‌లాగ్ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు 32 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షలకు 11,617 మంది విద్యార్థులు హాజరవుతారని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

### పోలీసునంటూ బెదిరించి నగదు అపహరణ

నవీపేట: నవీపేట శివారులో ఓ వ్యక్తి పోలీసునంటూ బెదిరించి, ఒకరి వద్ద నగదు అపహరించాడు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మద్దెపల్లికి చెందిన యడ్ కిషన్ ఈనెల 5న నవీపేట నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. నవీపేట శివారులో గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి కిషన్ వాహనాన్ని ఆపాడు. పోలీసునంటూ బెదిరించి కిషన్ జేబులో ఉన్న రూ. 10500ల నగదుతోపాటు అన్ని కార్డులను బలవంతంగా లాక్కొని, పోలీస్ స్టేషన్‌కు రమ్మని పారిపోయాడు. అతని ఆచూకీ కోసం ఆరా తీయగా పోలీసు కాదని తెలుసుకున్నాడు. అతడిని పట్టుకుని చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# వేసవి తాపం.. జ్యూస్‌లతో ఉపశమనం

- ఎండ వేడి తట్టుకోలేక పండ్ల రసాలను సేవిస్తున్న జనం



నగరంలోని జ్యూస్‌సెంటర్



కొబ్బరిబొండాలను తాగుతున్న ప్రజలు

నిజామాబాద్ రూరల్: రోజు రోజుకూ ఎడలు మండిపోతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఉపశమనం కోసం ప్రజలు శీతల పానియాల వైపు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పండ్ల దుకాణాలు, జ్యూస్ సెంటర్ల వద్ద రద్దీ పెరుగుతోంది. సపోట, మామిడి, యాపిల్, పైనాపిల్, ద్రాక్ష, కర్బూజ తదితర జ్యూస్‌లను ప్రజలు సేవిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రధానంగా ఖలీల్‌వాడీ, గాంధీ చౌక్, గంజ్ రోడ్, సుభాష్‌నగర్, వినాయక్‌నగర్, పులాంగ్, గాయత్రీనగర్, రాజరాజేంద్ర చౌరస్తా, కోర్టు చౌరస్తా, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో జ్యూస్ పాయింట్లు, చెరుకు రసాల దుకాణాలను ఏర్పాటు చేశారు. ఒక్కో రకం జ్యూస్ రూ.20 ల నుంచి రూ.50 ల వరకు విక్రయిస్తున్నారు. కాగా, వేసవి నేపథ్యంలో కొబ్బరి బొండాలకూ డిమాండ్ ఉంది. ఒక్కో కొబ్బరి బొండం ధర రూ.80 పలుకుతోంది. అత్యవసర పని నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చేవారితోపాటు నగర ప్రజలు వడదెబ్బ తగలకుండా ఉండేందుకు కొబ్బరినీరు, పండ్ల రసాలు సేవిస్తున్నారు.

**రోజుకో బొండం తాగుతా..**



నేను రోజుకో కొబ్బరి బొండం తాగుతా. దీంతో శరీరం డీహైడ్రేషన్‌కు లోనుకాదు. అలాగే వడదెబ్బ తగలకుండా ఉండేందుకు పండ్ల రసాలను తాగుతాం.

– షాదుల్లా, నగరవాసి

**గిరాకీ ఎక్కువే..**



జ్యూస్ పాయింట్‌లో అన్ని రకాల పండ్ల రసాలు అందుబాటులో ఉంటాయి. రోజుకు 250 మంది వరకు వచ్చి జ్యూస్‌లు తాగుతారు. మధ్యాహ్నం, సాయంత్రం గిరాకీ ఎక్కువగా ఉంటుంది.

– సలీం, జ్యూస్ పాయింట్ యజమాని

**బెంగుళూర్ బొండాలు ప్రత్యేకం..**



బెంగుళూరు కొబ్బరి బొండాల్లో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఖనిజ లవణాలు అధికంగా ఉండి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. రోజూ 4వేల వరకు బొండాలు విక్రయిస్తాం.

– అశోక్, కొబ్బరి బొండాల యజమాని

### సీఎం తన వైఖరి మార్చుకోవాలి



మాట్లాడుతున్న పీఆర్టీయూ నాయకులు

నిజామాబాద్ అర్బన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులపై చేసిన వ్యాఖ్యలు సరైనవి కాదని వెంటనే తన వైఖరి మార్చుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు జమ చేసుకున్న జీపీఎఫ్ డబ్బులను వెంటనే విడుదల చేయాలన్నారు. సరెండర్ బిల్లులు, మెడికల్ రియింబర్స్‌మెంట్ బిల్లులు, సప్లిమెంటరీ బిల్లులు గత రెండు సంవత్సరాల నుంచి రావడం లేదని, దీంతో అనేకమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే పెండింగ్ డీఏలను అని మంజూరు చేయాలన్నారు. జిల్లా ప్రతినిధులు కిషన్, గంట అశోక్, శ్రీనివాస్, సాయిరెడ్డి, నగేష్‌రెడ్డి, గోపి, హరిప్రసాద్, రవినాయక్, లక్ష్మణ్‌సాయి, నరేష్, మైఖేల్, మోహన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌జేసీ సెట్‌కు బందోబస్తు

ఖలీల్‌వాడి: జిల్లాలోని తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఆర్‌జేసీ సెట్) పరీక్షాకేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీపీ సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆయా పరీక్షా కేంద్రాల వద్ద ఈనెల 10న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ అమలులో ఉంటుందన్నారు. ఈ సెంటర్ల వద్ద షాపులను తెరిచి ఉంచవద్దని, పరీక్ష కేంద్రం ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్‌లను శనివారం ఉదయం 7నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మూసి ఉంచాలని ఆదేశించారు.



## క్రైం కార్నర్

### చెరువులో పడి ఒకరి మృత్యువాత

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలోని చెరువులో ఓ వ్యక్తి పడి మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన తోడెటి నర్సింహులు(35) ఆలూర్ గ్రామంలో మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగ గత కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసై పనివెళ్లకుండా తిరుగుతున్నాడు. సోమవారం ఉదయం పనికి వెళుతున్న అని చెప్పి బయటకు వెళ్లిన నర్సింహులు తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం చెరువులో శవమై కనిపించాడు. మద్యం మత్తులో చెరువులో పడి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

**జక్రాన్‌పల్లి మండలంలో..**

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామ పెద్ద చెరువులో మెండె సాయమ్మ (59) అనే మహిళా చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై మాలిక్ రహమాన్ తెలిపారు. చెరువులో మహిళ మృతదేహం తేలినట్లు స్థానికులు మంగళవారం సమాచారం అందించడంతో ఎస్సై ఘటన స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### ఎస్సారెస్పీలో ఒకరి ఆత్మహత్య

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రం శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ వివరాలు ఇలా.. మండలంలోని నల్లూర్ గ్రామానికి చెందిన అటాక్ బాలకృష్ణ(21)కు గత కొంతకాలంగా పెళ్లి సంబంధాలు చూస్తున్నా కుదరడం లేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, తిరిగిరాలేదు. మంగళవారం ఉదయం ప్రాజెక్ట్ వద్దమృత దేహం తేలడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా బాలకృష్ణ మృతదేహంగా గుర్తించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### పేకాడుతున్న నలుగురి అరెస్టు

మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ వద్దగల పర్మిట్ గదిలో పేకాట స్థావరంపై సోమవారం రాత్రి పోలీసులు దాడి చేసి, పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై రాజశేఖర్ మంగళవారం తెలిపారు. రూ.6450 నగదు, నాలుగు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల గ్రామ శివారులోని మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు కొడిచర్ల శివారులో పోలీసులు నిఘా వేశారు. దీంతో రెండు ట్రాక్టర్లను పట్టుకొని కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సునీల్ తెలిపారు.

**ఇందల్వాయి మండలంలో..**

ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్న వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన సాయికుమార్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్సై సందీప్ తెలిపారు.

### కరెంట్ షాక్‌తో గేదె మృతి

దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లి గ్రామంలో మంగళవారం విద్యుత్‌షాక్‌తో ఓ గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన రైతు పొగాకు రమేష్‌కు చెందిన గేదె పొలం వద్ద మేత మేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో రైతు రమేష్‌కు దాదాపు రూ.65వేల నష్టం జరిగినట్లు వివరించారు.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత చెందారు. ఆటో అదుపుతప్పి నందిపేట మండలంలో ఓ వృద్ధుడు, బైక్ అదుపుతప్పి పిట్లం మండలంలో ఓ యువకుడు, డొంకేశ్వర్ మండలంలో ఒకరు చనిపోయారు. వర్ని మండలంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందారు.



మృతిచెందిన గోక సాయన్న

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ గుట్ట ప్రాంతంలో ఆటో బోల్తా పడి ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన గోక అశోక్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం నందిపేట మండలంలోని కుద్వాన్‌పూర్ ఎల్లమ్మ ఆలయానికి మొక్కు తీర్చుకోవడానికి వచ్చాడు. దర్శనం చేసుకున్న అనంతరం తిరిగి ఇంటికి బయలుదేరగా ఎల్లమ్మ గుట్ట పైనుంచి ఆటో కిందికి దిగుతుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో ప్రయాణిస్తున్న గోక సాయన్న (65), మమత, నితిన్, లక్ష్మిప్రసన్నలకు గాయాలు కాగా వారిని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గోక సాయన్న మృతి చెందాడు. మృతుడి కొడుకు గోక అశోక్ ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్ గట్టు సత్యనారాయణపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

**పిట్లం మండలంలో..**



మృతి చెందిన యాదగిరి

పిట్లం(జుక్కల్): బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రాంపూర్ గ్రామ శివారులోని పిట్లం-బాన్సువాడ రహదారిపై చోటు చేసుకుంది. పిట్లం ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మాసూర్ గ్రామానికి చెందిన సౌదర్పల్లి యాదగిరి (34) తన బైక్‌పై సోమవారం రాత్రి అంకోల్ తండా నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో బైక్ అదుపుతప్పడంతో యాదగిరి కింద మీద పడి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతుడి తల్లి విట్టవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**వర్ని మండలంలో..**

వర్ని: వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవూరు-చందూరు గ్రామాల మధ్య సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగారాం (60) అక్కడికక్కడే మృతి చెందినట్లు వర్ని మహేష్ వెల్లడించారు. రోడ్డుపై వెళ్తున్న గంగారాంను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

**డొంకేశ్వర్ మండలంలో..**



పోశన్న (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని అన్నారం మాజీ గ్రామ సర్పంచ్ మంగ్లారం పోశన్న (47) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నికాల్‌పూర్‌లో సోమవారం జరిగిన బంధువుల ఫంక్షన్‌కు పోశన్న వెళ్లాడు. రాత్రి స్కూటీపై తిరిగి ఇంటికి బయలుదేరాడు. అన్నారం గ్రామ శివారులోకి రాగానే మూల మలుపు వద్ద స్కూటీ అదుపుతప్పడంతో కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. అంత్యక్రియలు బుధవారం స్వగ్రామంలో జరగనున్నాయి.

### నగరంలో పోలీసుల తనిఖీలు



ఖలీల్‌వాడి: నగరంలోని ధర్మపురి హిల్స్‌లో మంగళవారం రాత్రి ఆరో టౌన్ పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల ఇళ్లను, రౌడీషీటర్ల ఇళ్లను చెక్ చేశారు. వాహనాలకు సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు, విత్అట్ నెంబర్ ప్లేట్లు లేని 26 ఆటోలు, 42 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. అనంతరం నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో అనుమానాస్పదంగా ఎవరైనా తిరుగుతున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సీఐలు సురేష్ కుమార్, రఘుపతి, శ్రీనివాసరాజు, శ్రీనివాస్, విమెన్ పీఎస్ సీఐ శ్రీలత, డిచ్ పల్లి సీఐ మల్లేష్, ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆలయాల్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్):మండలంలోని ముదక్‌పల్లిలోగల సూదులమ్మ ఆలయం, మంచిప్ప శివారులోని గండిమైసమ్మ ఆలయాల్లో చోరీ జరిగింది. ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. సూదులమ్మ ఆలయ గేటుకు వేసిన తాళం, హుండీని సోమవారం అర్ధరాత్రి నిందితుడు పగులగొట్టారు. హుండీలో ఉన్న సుమారు రూ.వెయ్యి వరకు నగదును ఎత్తుకెళ్లాడు. ఆలయ గేటు వద్ద ఉన్న సీసీ కెమెరాను ధ్వంసం చేశాడు. మంగళవారం ఉదయం ఆలయ సిబ్బంది చోరీని గుర్తించి పోలీసులు, గ్రామపెద్దలకు సమాచారమిచ్చారు. పోలీసులు, క్లూస్‌టీమ్ సిబ్బంది వచ్చి ఆధారాలు సేకరించారు. అలాగే ఆలయం బయట నిందితుడు దొంగిలించిన బైక్, తాళం పగులగొట్టేందుకు వాడిన పారను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**గండి మైసమ్మ ఆలయంలో..**

మంచిప్ప శివారులోని గండి మైసమ్మ ఆలయ హుండీని దుండగుడు సోమవారం అర్ధరాత్రి ఎత్తుకెళ్లాడు. హుండీలో రూ.400 వరకు నగదు చోరీకి గురైనట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. కాగా రెండు ఆలయాల్లో చోరీకి పాల్పడిన నిందితుడిని ముదక్‌పల్లి గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. చోరీ విషయమై నిందితుడిని విచారణ చేపట్టి, వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

### డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో సిబ్బంది ఇటీవల నగరంలో డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. దీంతో మద్యం తాగి వాహనాలు నడుపుతూ సుమారు 25 మంది పోలీసులకు పట్టుబడ్డారు. వారికి సంబంధింత పోలీస్ స్టేషన్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి, మంగళవారం జిల్లా కోర్టులో హాజరుపర్చారు. జడ్జి వారిలో ఐదుగిరికి రెండు రోజుల జైలు శిక్ష, మిగిలిన 20 మందికి జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

**జక్రాన్‌పల్లి మండలంలో..**

జక్రాన్‌పల్లి: మండలంలో ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా పడకల్ గ్రామానికి చెందిన అప్పాల వినోద్ మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో అతడిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ఆర్మూర్ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై మాలిక్ రహమాన్ తెలిపారు.